**ప్రశ్నలు & సమాధానాలు**
**ప్రశ్న 319: కార్యసాధన**
**మే 11, 2024**

*ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 248-253 నుండి తీసికొనబడినవి*

**స్వామి! వివిధ మతాలలో రకరకాల సాధనలు బోధించారు. దైవత్వము చేరడానికి ఈ మార్గములు ఎంత మాత్రము పని చేస్తాయి? ఆ సాధనలు ఎంత వరకు అనుసరించాలి? కొన్నిటిని చూస్తే ఒక జీవితకాలంలో గమ్యం చేరుకోవడం సాధ్యం కాదనిపిస్తుంది. అలా అని ఏ సాధన చేపట్టడం లేదే అని చింత. మాకు సరి అయిన దారి చూపించి శాంతిని ఇవ్వండి.**

**భగవాన్:** సాధన గురించి నీ వర్ణన వింటే సాధన అంటే నీకు ఏమిటో తెలియదనిపిస్తుంది. నువ్వు 'ఆధ్యాత్మికం' అనుకొనే సాధనలు మనసుతో చేసేవి. అవి క్షణికమైన శాంతిని, తృప్తిని మాత్రమే ఇస్తాయి. అలా అని పూర్తిగా పనికి రావని తీసేయలేము. సాధనలు మీ సమయాన్ని ఒక పవిత్రమైన మార్గంలో ఉపయోగించడానికి పని చేస్తాయి. సాధన అంటే ఏమిటి? 'స' అంటే సాలోక్యం, స్వర్గంలో దేవుని తలపులలో మునిగి ఉండడం. కనుక సాధన మనకు సాలోక్యం అనే ధనమును చేకూరుస్తుంది.

మనసుతో తలపెట్టే  ప్రతి కార్యము ద్వైతం, కృత్రిమం, క్షణికం. ఉదాహరణకు, నీవు ప్రయాణంలో ఉన్నావనుకో. నీ పక్కనే ఒక దొంగ కూడా ప్రయాణిస్తుంటే భద్రంగా ఎలా అనిపిస్తుంది? అదే విధంగా మనసుతో తలపెట్టే ఏ కార్యము పరమానందాన్ని ఇవ్వలేవు. కానీ సాధనతో ఆత్మభావము పై ఉన్న తెరను తొలగించవచ్చు. ఈ తెరను తొలగిస్తే ఆత్మభావన స్పష్టమౌతుంది. ఇది ఎక్కడినుంచో వచ్చేది కాదు, ఎక్కడికీ పోయేది కాదు.

అయితే సాధన ఎంత కాలం చేయాలి? నీకు ఒక గాయం అయితే, అది మానడం మొదలు పెట్టిన తర్వాత దాని పై పక్కు ఏర్పడి, క్రమక్రమంగా గాయం మానిన తర్వాత అదే రాలిపోతుంది. కాని ఆ పక్కును బలవంతంగా ఒలిస్తే ఆ గాయం మరింత పెద్దదౌతుంది. అదే విధంగా ఒక సారి ఆత్మభావం ఏర్పడితే సాధన గురించి సందేహాలు రావు.

మరొక ఉదాహరణ: నీవు వంట చేస్తున్నప్పుడు మంటను సరి చేస్తావు. ఆ మంట ఎంత కాలం ఉంచాలంటే అన్నం ఉడికేంతవరకు. అదే విధంగా సాధన కూడా జ్ఞానం పొందేంత వరకు మాత్రమే అవసరం.

**స్వామి! అనుభవం, వివేకం, ధృడనిశ్చయం ద్వారా జ్ఞానం లభిస్తే అది మాతో శాశ్వతంగా ఉండిపోతుందా, లేక కొంత కాలం తర్వాత మళ్ళీ అజ్ఞానంలో పడిపోతామా?**

**భగవాన్:** అది అసాధ్యం. పోయేటటువంటి దానిని జ్ఞానం అనలేము. మళ్ళీ అజ్ఞానంలో పడిన వాడిని జ్ఞాని అనలేము.

జ్ఞానం అనే దానికి రాకపోకలు ఉండవు. మీరు దివ్యజ్ఞాన స్వరూపులు. మీ లౌకిక వాంఛలు, విషయ సుఖాలు, దేహాభిమానం ఇవన్నీ జ్ఞానాన్ని కప్పి వేస్తాయి. ఒక సారి ఆత్మసాక్షాత్కారం కలిగిన తర్వాత ఆ జ్ఞానం స్థిరంగా నిలుస్తుంది.

ఒక చిన్న ఉదాహరణ: పాలను పెరుగు చేసి దానిని చిలికితే వెన్న వస్తుంది. కానీ ఆ వెన్నను మళ్ళీ పాలలో కలపడానికి ప్రయత్నిస్తే ఎన్నటికీ కలవదు కదా? అదే విధంగా జ్ఞానం అనే వెన్న పాలు అనే అజ్ఞానంలో కలవలేదు. జ్ఞాని అయిన వాడు కూడా అజ్ఞానుల నడుమ నివసించినా తన జ్ఞానమును ఎప్పటికీ పోగొట్టుకోడు. అజ్ఞానం అతనిని అంటదు. ఒక సారి నీవు జ్ఞానం పొందితే అది ఎప్పటికీ పోదు.

**స్వామీ! దేహాభిమానం వలన ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆటంకం కలుగుతుందా? ఈ దేహాభిమానం నన్ను ఎప్పుడూ వదలదు. దయచేసి ఏమి చేయాలో తెలియ చేయండి.**

**భగవాన్:** మీ దేహాన్ని నిర్లక్ష్యం చేయమని నేను ఎప్పుడూ చెప్పలేదు. దేహం ఒక పరికరం మాత్రమే అని గుర్తు పెట్టుకోండి. ఒక దేవాలయం ఎంతో అందంగా, శుభ్రంగా, ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ దానిని బయటి నుంచి మాత్రమే చూసి గర్భగుడి లోని దేవుని విగ్రహం చూడకుంటే తృప్తి ఉండదు. అక్కడ ఉండే మూలవిరాట్టును చూస్తేనే ఆనందము, పరవశము అనుభవిస్తాము. అదే విధంగా మీ దేహం కదిలే దేవాలయం. మీ వాంఛల వల్ల అది అపవిత్రం అవదు. కానీ ఆ వాంఛలు మంచివి ఉండాలి, చెడువి ఉండకూడదు.

మానవునిలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే అరిషడ్వర్గాలు ఉంటాయి. కానీ వాటిని మంచి మార్గములో పెట్టవచ్చు. ఉదాహరణకు, క్రోధం వలన మీకు ఎప్పటికీ మంచి జరగదు. కానీ మీ చెడు ప్రవర్తన, చెడు ఆలోచనలు, చెడు భావనల పట్ల క్రోధం ఉంటే మిమ్మల్ని మీరు అభివృద్ధి చేసుకోవచ్చు. కనుక వేరే వారిపై కోపం చూపించకండి. మీ క్రోధం పైనే కోపం చూపించుకోండి. అదే విధంగా మితిలేని కోరికలు ఉంటే జీవితం అసంతృప్తికరంగా ఉంటుంది. కానీ భగవంతునిపైన, భగవంతుని సేవ చేయుట పైన కోరికలు ఉంటే ఆ కామమే ఉన్నతంగా మారుతుంది.

కనుక మనం స్వార్థంగా, స్వార్థపరంగా, లౌకికంగా, విషయాసక్తితో ఉంటే ఈ దేహం ఆధ్యాత్మిక అభివృద్ధికి తప్పక ఆటంకం కలిగిస్తుంది. కానీ అదే దేహాన్ని ఆత్మసాక్షాత్కారం పొందడం కొరకు ఒక పని ముట్టుగా ఉపయోగించుకుంటే అప్పుడు అది ఆటంకంగా నిలువదు.

హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు, రావణుడు, కుంభకర్ణుడు, శిశుపాలుడు, జరాసంధుడు, దంతవక్రుడు, వీళ్ళందరూ వారి చెడు భావనలు, చెడు కర్మలు, క్రూరమైన, హింసించే స్వభావముండే వారు కనుక పతనమైపోయారు. ఈ దేహము భగవచ్చింతన కొరకు, ఆత్మసాక్షాత్కారము కొరకు భగవంతుడు ప్రసాదించిన అనుగ్రహం.

**స్వామి! జీవిత లక్ష్యాన్ని, గమ్యాన్ని సులభంగా ఎలా పొందవచ్చు?**

**భగవాన్:** చాలా సులభం. ఒక చిన్న ఉదాహరణ: ఒక రోగి తన జబ్బుకి మందులు వాడి నయమౌతాడు. ఎందుకంటే ఆ మందులు కొంత కాలం వరకు రోజు తీసుకోవడం వల్ల మళ్ళీ రోగం రాకుండా నయమౌతాడు. అంటే మళ్ళీ రోగి అవకూడదు.

అదే విధంగా ఈ జన్మ మీకు ఎందుకు లభించిందంటే మళ్ళీ జన్మ తీసుకోకుండా ఉండడం కొరకు. అంటే జనన మరణాల చక్రంలోంచి బయట పడాలి. అందువలన ఈ జన్మ లోనే ఆధ్యాత్మిక సాధన బాగా చేయాలి. ఇదే మీ జీవిత లక్ష్యం, జీవిత గమ్యం.

స్వామి! సత్యాన్వేషణ అంటే ఏమిటి? ఈ పవిత్ర అన్వేషణ ఎలా సలపాలి?

భగవాన్: ఎవరైనా సత్యాన్వేషణ చేపట్టాను అంటే అది అజ్ఞానానికి చిహ్నం. సత్యం అంతటా వ్యాపించి ఉంటే దాని కొరకు వెతకడం ఎందుకు? సత్యమే దేవుడు. దేవుడే సత్యం. దేవుడు సర్వవ్యాపకుడు. అదే విధంగా సత్యం కూడా సర్వవ్యాపకం.

సత్యమునందుండి సర్వంబు సృష్టించె
సత్యమునననణగె సర్వ సృష్టి
సత్య మహిమ లేని స్థలమేది కనుగొన్న
శుద్ధ సత్త్వమదియే చూడరయ్య

నిత్యసత్యమైన భగవంతుడు ఈ విశ్వమంతటినీ సృష్టించాడు. అదే మళ్ళీ సత్యంలోనే కలిసిపోతుంది. అదే నిత్య సత్యం.

మీ కళ్ళతో మీ పిల్లలను చూస్తారు. అదే కళ్ళతో మీ భార్యను చూస్తారు. మీ కళ్ళు అవే కళ్ళైనా మీరు మీ పిల్లలను చూసే చూపులు, మీ భార్యను చూసే చూపులు వేరుగా ఉంటాయి. కానీ మీరందరినీ చూసే భావమే సత్యం. అంటే మీ చూపులు మీ భావములపై ఆధార పడి ఉన్నాయి. అదే మీ భావములను చూపులను వేరు చేస్తుంది.

సత్యాన్వేషణ అంటే ఏది, ఎప్పుడు, ఎందుకు, ఎవరు, ఎక్కడ, ఎలా అనే వాటిని తెలుసుకోవడమే సత్యం.

వచ్చే వారం మరిన్ని దివ్యోపదేశములతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు.

ఓం సాయి రాం